# ప్రయాణికుల జేబులకు చిల్లు

- ఆర్టీసీ బస్టాండ్‌లో నిలువు దోపిడీ
- అధిక ధరలకు తినుబండారాలు, శీతల పానీయాల విక్రయం
- ఎమ్మార్పీని ఉల్లంఘిస్తున్న దుకాణదారులు
- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని అధికారులు

**నెల్లూరు సిటీ:** నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కొందరు దుకాణదారులు ధనార్జనే లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అధిక ధరలకు తినుబండారాలు, శీతల పానీయాలు తదితరాలను విక్రయిస్తూ భారీగా గడిస్తున్నారు. ఈ తంతు నిత్యం జరుగుతున్నా, చోద్యం చూడటం అధికారుల వంతవుతోంది.

**ఇదీ పరిస్థితి..**

నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్‌లో 30, ప్రధాన బస్టాండ్‌లో 45 దుకాణాలున్నాయి. నిత్యం దాదాపు 250 బస్సుల్లో 40 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. చివరి నిమిషంలో హడావుడిగా వచ్చే ప్రయాణికులు తమ బస్సు మిస్సవుతుందనే ఉద్దేశంతో అధిక ధరలను వెచ్చించి వీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. కొన్ని సందర్భాల్లో ఎవరైనా ప్రశ్నిస్తే, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. వాస్తవానికి ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణంతో పాటు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అధికారులు అందించాల్సి ఉన్నా, ఆ దిశగా చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు.


ఆర్టీసీ బస్టాండ్‌లోని స్టాళ్లు

**నిత్యకృత్యం**

న్యాయవాదైన ఓ ప్రయాణికుడు ఆర్టీసీలోని ఓ హోటల్‌కు మూడు నెలల క్రితం వచ్చారు. టిఫిన్‌ను ఆర్డర్ చేయగా, అధిక ధరలను వసూలు చేశారు. ఇదే విషయమై నిర్వాహకుడ్ని ప్రశ్నించగా, సరైన సమాధానం చెప్పలేకపోవడంతో ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించి నిర్వాహకులకు రూ.1500 జరిమానా విధించారు. అయితే సామాన్యులేమీ చేయలేక దుకాణదారులు అడిగినంత మొత్తాన్ని సమర్పిస్తున్నారు.

**అన్నింట్లోనూ అధికమే**

ప్రతి వస్తువుపై అధిక చార్జీలను వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు రూ.రెండుకు విక్రయించాల్సిన వాటర్ ప్యాకెట్‌ను రూ.నాలుగుకు.. రూ.20 విలువజేసే కూల్‌డ్రింక్స్ సీసాను రూ.25కు.. రూ.20 బిస్కెట్ ప్యాకెట్‌ను రూ.25కు.. రూ.20 లేస్ ప్యాకెట్‌ను రూ.25కు విక్రయిస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడితేనే పరిస్థితిలో మార్పొచ్చే అవకాశం ఉంది.

### కానరాని ధరల పట్టిక

దుకాణాల్లో వస్తువులు, ఆహార పదార్థాలు, శీతల పానీయాల ధరల పట్టికను వినియోగదారులకు కనిపించకుండా కొందరు వ్యవహరిస్తున్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. వీటిని దుకాణం లోపలే ఉంచుతున్నారు. ఫలితంగా నిర్వాహకులు ఎంత చెప్తే అంత చెల్లించాల్సి వస్తోంది.


ఎమ్మార్పీ విక్రయాలపై అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

### నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు



వాటర్ బాటిల్‌పై రూ.ఐదు అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రతి వస్తువులోనూ ఇదే తీరును అవలంబిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నా, ఏ మాత్రం భయపడటంలేదు.

– వంశీ, ప్రయాణికుడు

### అధికారుల పర్యవేక్షణ అవసరం



ఆర్టీసీ బస్టాండ్‌లో అధిక ధరలకు తినుబండారాలను విక్రయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా వారు స్పందించి చర్యలు చేపట్టాలి.

– తులసీరామ్, నవాబుపేట

### పరిశీలించి చర్యలు చేపడతాం

ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించకూడదు. స్టాళ్లలో అధిక ధరలకు విక్రయించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఫిర్యాదులొచ్చిన వెంటనే స్పందించి చర్యలు చేపడుతున్నాం.

– మురళీబాబు, ప్రజా రవాణాధికారి

## క్లుప్తంగా

### వాకర్స్‌కు వైద్య పరీక్షలు




**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 300 మందికి వైద్య పరీక్షలను వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించామని అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవీంద్ర, కోశాధికారి గోపీనాథ్, సుబ్బరాజు, స్వర్ణ రమేష్, సత్యనాథ్, కృష్ణమూర్తి, ఎలక్టెడ్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, చంద్రమౌళి, ఖలీల్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

### హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపిక



**నెల్లూరు (టౌన్):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ హ్యాండ్‌బాల్ జట్టుకు నగరంలోని ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థి రమేష్ ఎంపికయ్యారని ప్రిన్సిపల్ వేణుగోపాల్, పీడీ రవీంద్రబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు మాట్లాడారు. తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీలో ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న ఇంటర్ వర్సిటీ పోటీల్లో వీఎస్‌యూ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు. వీఎస్‌యూ పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణలో పాల్గొంటున్నారన్నారు.

### శేషవాహనంపై ఉదయకళేశ్వరుని విహారం



**కొడవలూరు:** మండలంలోని గండవరంలో వెలసిన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి శేషవాహనసేవను వేడుకగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజారోహణాన్ని నిర్వహించారు. శేషవాహనంపై గ్రామోత్సవాన్ని జరిపారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు బండారు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈఓ బండి శాంతయ్య, చైర్మన్ ఆలం మాలకొండయ్య పర్యవేక్షించారు.

### బ్రహ్మోత్సవ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం



**కొడవలూరు:** మండలంలోని గండవరంలో వెలసిన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరుని బ్రహ్మోత్సవ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారాన్ని ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. చైర్మన్‌గా ఆలం మాలకొండయ్య, సభ్యులుగా పిట్టు రంగనాథమ్మ, గుర్రాల భవాని, మడపర్తి విజయమ్మ, కావలి విజయలక్ష్మి, నెల్లూరు మాధవి, ప్రదీప్‌కుమార్ రెడ్డి, జడ్డా రవీంద్రబాబు, నాపా బాలకృష్ణయ్య, తుమ్మల శ్రీనివాసులు, పరాంకుశం శ్రీనివాసాచారి, బండారు సుబ్రహ్మణ్యం ప్రమాణం చేశారు. పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ఈఓ శాంతయ్య, సర్పంచ్ రాజకుమారి, నేతలు పెనాక వెంకటేశ్వర్లురెడ్డి, సురేష్, గుర్రాల కోటయ్య, గోపీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆపస్ సేవా కార్యక్రమాలు అభినందనీయం

**ఇందుకూరుపేట:** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) సేవా కార్యక్రమాలను ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ దువ్వూరు రాధాకృష్ణారెడ్డి అభినందించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఆరుగురికి ఇంటర్మీడియట్‌లో 100, 75, 60 శాతం చొప్పున ఫీజులో రాయితీని విశ్వసాయి విద్యా సంస్థల వారు ఇవ్వనున్నారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలను రాధాకృష్ణారెడ్డి అభినందించి బహుమతులను అందజేశారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాలాచార్యులు, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, ఇందుకూరుపేట అధ్యక్షుడు కేశవరామ్, సుబ్బరాయుడు, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## పురుషామృగ వాహనంపై మూలస్థానేశ్వరుడు



**నెల్లూరు(బృందావనం):** మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పురుషామృగ వాహనంపై స్వామివారు ఆదివారం విహరించారు. నగరోత్సవం వేడుకగా సాగింది. ఆయా ఉత్సవాలకు ఉభయకర్తలుగా మోహన్, కస్తూరి, జితేంద్రవర్మ, హైంద్రి తదితరులు వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## మహిళతో అసభ్యకర ప్రవర్తన

**నెల్లూరు(క్రైమ్):** మహిళపై ఆటోడ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రంగనాయకులపేటకు చెందిన ఓ మహిళ నూడిల్స్ తినేందుకు గానూ సమీపంలోని దుకాణం వద్దకు ఈ నెల 17న వెళ్లారు. నూడిల్స్ తింటుండగా, అక్కడే ఉన్న ఆటోడ్రైవర్ దాము ఆమెతో అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో అక్కడ్నుంచి వెళ్లిపోయిన బాధితురాలు తన కుటుంబసభ్యుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా హిందీ ఆరాధన వార్షికోత్సవం



**నెల్లూరు(బృందావనం):** నగరంలోని బాప్టిస్ట్ చర్చి డానీహాల్లో హిందీ ఆరాధన వార్షికోత్సవాన్ని ఘనంగా ఆదివారం నిర్వహించారు. సంఘ కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేకారాధనలో సంఘ కాపరి రెవరెండ్ కంది శ్యామ్‌సన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. క్విజ్, కంఠస్థ వాక్యాలు, పాటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. గాయక బృందం ఆలపించిన హిందీ గీతాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. కృపారాజన్, జానీజో, సంజయ్, మహేష్, దినేష్, రమేష్‌బాబు, జన్ని జోయెల్, హుల్దాశ్యామ్‌సన్, నిర్మల సుధాకర్, అనితారాయ్, డాక్టర్ రాజకుమారి, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

# టెన్నిస్‌బాల్ క్రికెట్‌లో ఉత్తమ ప్రతిభ



**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** తిరుపతి జిల్లా చంద్రగిరిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో మహిళా విభాగంలో జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లా జట్టు కెప్టెన్ స్వాతికారెడ్డి ఉమెన్ ఆఫ్ ది టోర్నీ అవార్డును దక్కించుకున్నారు. నెల్లూరు జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ హరిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ లీలాధర్‌రెడ్డి, సెక్రటరీ యుగంధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అజయ్‌కుమార్ తదితరులు అభినందనలను తెలియజేశారు.

# పోరాటాలకు సిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న అంకయ్య

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బాలకాశి పిలుపునిచ్చారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీటర్ రీడర్ల విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్న తరుణంలో రీడర్ల ఉద్యోగ భద్రతకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మీటర్ రీడర్లకు నగరాల్లో రూ.3.60, రూరల్‌లో రూ.3.73 ఇవ్వాలనే యాజమాన్య ఉత్తర్వులను కాంట్రాక్టర్లు అమలు చేయడంలేదని ఆరోపించారు. ఎస్కో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసినా, ఎస్ఈ నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి హజరత్‌వలీ, జిల్లా కార్యదర్శి కృష్ణ, నవీన్, వెంకటసుబ్బయ్య, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గాన నీరాజనం



**నెల్లూరు(బృందావనం):** అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని శాంతి కల్చరల్స్ అధ్యక్షుడు అమానుల్లాఖాన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఘంటసాలను స్మరిస్తూ గాన నీరాజనాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో జరిపారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. గాయకులు పాటూరి శ్రీనివాసులు, లక్ష్మి, ముక్తియార్‌బేగం, షఫీ, రామచంద్రరావు, ఖలీల్ అహ్మద్, మహబూబ్‌బాషా, మహ్మద్ షరీఫ్, సత్యనారాయణ, కేతా సుబ్బారావు, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం


నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేస్తున్న సునీల్

**నెల్లూరు(అర్బన్):** కావలిలోని పుల్లారెడ్డినగర్‌కు చెందిన తటవర్తి శేషమ్మ (95) వయోభారంతో తన నివాసంలో ఆదవారం మరణించారు. ఈ క్రమంలో అభయం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యురాలు శ్రీవాణి సహకారంతో ఆమె నేత్రాలను నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు కుటుంబసభ్యులు దానం చేశారు. వీటిని ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం మృతురాలి కుటుంబసభ్యుడు వెంకటకృష్ణారావుకు సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321, 94946 08060 నంబర్లను సంప్రదించాలని సునీల్ కోరారు.

## కారు డ్రైవర్ ఆత్మహత్య

**నెల్లూరు(క్రైమ్):** పుట్టింటికి భార్య వెళ్లిందనే మనస్తాపంతో కారు డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కపాడిపాళెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. కపాడిపాళెనికి చెందిన శ్రావణ్‌కుమార్ (26), సుమాంజలి దంపతులకు ఇద్దరు పిల్లలు. కారుడ్రైవర్‌గా శ్రావణ్‌కుమార్, నర్సుగా ఆమె పనిచేస్తున్నారు. దంపతుల నడుమ ఇటీవల స్వల్ప వివాదం చోటుచేసుకుంది. దీంతో భర్తపై అలిగి తన పుట్టింటికి ఆమె వెళ్లారు. మనస్తాపానికి గురైన శ్రావణ్‌కుమార్ తన ఇంట్లోని ఫ్యాన్‌కు దుప్పటితో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడి తల్లి కుమారి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో అవసరం


వ్యాయామ పరికరాలను పరిశీలిస్తున్న నారాయణ

**నెల్లూరు(సెంట్రల్):** మనిషి ఆరోగ్యానికి వ్యాయామం, క్రీడలు ఎంతో అవసరమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో గల పార్కుల్లో వ్యాయామ సామగ్రిని ఆదివారం ఆయన పరిశీలించారు. సంతపేటలోని మోడల్ స్కూల్లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్కుల్లో వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

## ఇజ్తిమాకు పోటెత్తిన భక్తజనం

**కొడవలూరు:** మండలంలోని చంద్రశేఖరపురంలో నిర్వహిస్తున్న ఇజ్తిమాకు ముస్లింలు భారీగా తరలివచ్చారు. హాజరైన వారికి మంచినీరు, భోజన వసతిని వీపీఆర్ ఫౌండేషన్ కల్పించగా, అన్నదానాన్ని పలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించాయి. సీఐ సురేంద్రబాబు, కొడవలూరు, విడవలూరు ఎస్సైలు కోటిరెడ్డి, నరేష్‌యాదవ్, 350 మంది సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


మురళీకృష్ణను సత్కరిస్తున్న నిర్వాహకులు

**నెల్లూరు(బృందావనం):** వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని ఆర్టీసీ నెల్లూరు ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆచారివీధిలోని నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. జనవరి, ఫిబ్రవరిలో పుట్టిన రోజు జరుపుకొంటున్న సీనియర్ సభ్యులతో కేక్‌ను కట్ చేయించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుండ్లపల్లి శ్రీధర్‌రావు, చందూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దేపల్లి సుబ్బారావు, కృష్ణయ్య, బొమ్మిశెట్టి మురళీకృష్ణ, మెంటా మాల్యాద్రి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న తిరుపతయ్య

**నెల్లూరు(బృందావనం):** జిల్లాలోని పెన్షనర్లు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పెన్షనర్ల జిల్లా ఆడిట్ అధికారి తిరుపతయ్య పేర్కొన్నారు. భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్సెమ్ గౌస్ మాట్లాడారు. పెన్షనర్లకు రావాల్సిన డీఆర్, 11వ పీఆర్సీ తదితర బకాయిల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఎనెల్ హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ హరికృష్ణ, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రఘునాథ్, అటవీ విభాగ అధ్యక్షుడు ప్రసాద్, ఆత్మకూరు, పొదలకూరు యూనిట్ల అధ్యక్షులు శ్రీరాములు, కోటేశ్వరరావు, కార్యదర్శి సుధాకర్, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, ధీరేంద్రనాథ్, ఫయాజ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఎస్పీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల అదుపులో మోసకారులు


పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు

**నెల్లూరు(క్రైమ్):** ఉమ్రా యాత్ర పేరిట భారీ వసూళ్లకు పాల్పడి బోర్డు తిప్పేసిన ట్రావెల్స్ సంస్థకు చెందిన ఇద్దరు ప్రతినిధులను వేదాయపాళెం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం. పోలీసుల వివరాల మేరకు.. ఉమ్రా యాత్రకు వెళ్లాలనే ఉద్దేశంతో చెన్నైకు చెందిన ఓ ట్రావెల్స్ సంస్థను జిల్లాకు చెందిన పలువురు సంప్రదించారు. ఒక్కొక్కరికీ రూ.55 వేల వరకు ఖర్చవుతుందని సదరు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అనంతరం జిల్లాకు చెందిన 140 మంది వద్ద నగదు వసూలు చేసి వీసాలు పంపుతామని చెప్పారు. రోజులు గడుస్తున్నా ఎలాంటి సమాచారం లేకపోవడం, సంస్థ ప్రతినిధుల ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో మోసపోయామని గ్రహించిన బాధితులు.. పోలీసులను ఆశ్రయించారు. నెల్లూరులోని వెంగళరావ్‌నగర్ ఎన్సీసీ కాలనీకి చెందిన ఖాదర్ షరీఫ్ ఫిర్యాదు మేరకు వేదాయపాలెం పోలీసులు కేసును గత నెల 17న నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సంస్థ ప్రతినిధులు జాఫర్, షాకీర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు.

**కోయంబత్తూరులోనూ మోసం**

కోయంబత్తూరులోనూ పలువుర్ని వీరు ఇదే తరహాలో మోసగించారనే అంశాన్ని పోలీసులు గుర్తించారు. వారి నుంచి ఒత్తిళ్లు అధికమవడంతో నెల్లూరు జిల్లాలో వసూలు చేసిన నగదును కోయంబత్తూరు బాధితులకు అందజేశామని పోలీసుల విచారణలో వెల్లడించారని తెలిసింది. ఉమ్రా యాత్ర పేరిట విజయవాడలో వసూలు చేసి నెల్లూరు జిల్లా వారికి అందించేందుకు యత్నిస్తుండగా, పట్టుబడ్డారని సమాచారం. కాగా ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే సమాచారం అందుకున్న బాధితులు పెద్ద సంఖ్యలో వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌కు ఆదివారం రాత్రి చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. పోలీసుల లెక్కల మేరకు జిల్లాలోని 140 మంది వద్ద నుంచి రూ.70 లక్షల వరకు వసూలు చేశారని సమాచారం. సంస్థ ప్రతినిధుల నుంచి ఎంత మేర రికవరీ జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.